క్లుప్తంగా

'భవిత'ను వినియోగించుకోండి



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ప్రభాకర శర్మ అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలన



రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్ ప్రసాద్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలో 8, 9, 10 వార్డు పరిధిలో సుమారు 17 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా డ్రైన్లు, రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేశామన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ అన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, భీమరాజు, కట్టా రాజుబాబు విడదాసరి రాజా, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, చింతా శ్రీనివాసరావు తదితరులున్నారు.

పీఆర్‌జీలో అరబిందో ఫార్మా జాబ్‌మేళా

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అరబిందో ఫార్మా కంపెనీ జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ అఖరి సంవత్సర సైన్స్ విద్యార్థులు 88 మంది హాజరు కాగా 58 మందిని ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు ఎంపికచేశారు. ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించి విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఏలియా, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ సోమరాజు అభినందించారు.

క్రీడాకారులూ.. పేర్లు నమోదు చేసుకోండి

కరప: గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరిట ఆటల పోటీలను అక్టోబరు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నదని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇందులో భాగంగా 17 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు తమపరిధిలోని గ్రామ సచివాలయాల్లో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలలో పోటీలు జరుగుతాయన్నారు. గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతిభ కనపరచిన వారికి, మండలస్థాయిలో, తర్వాత జిల్లా స్థాయిలో పోటీలలో పాల్గొంటారని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

28న కిడ్నీ సమస్యలపై వైద్య శిబిరం

కాకినాడ: కిడ్నీ సంబంధ వ్యాధులపై ఈ నెల 28వ తేదీన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి చెప్పారు. ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సభ్యుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ పి.రవీంద్ర, ప్రముఖ కిడ్నీ మార్పిడి సర్జన్, యూరాలజిస్ట్ సీమకుర్తి సూర్యనిహార్ సంఘ సభ్యులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. కిడ్నీలో రాళ్లు, ప్రోస్టేట్, మూత్ర సమస్య, చెక్కెర వ్యాధి, బీపీ, క్రియాటిన్ సమస్యలతో ఉన్న వారికి అవసరమైన సూచనలిచ్చి, వైద్య సేవలు అందిస్తారన్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

కాకినాడ క్రైం: కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. స్టేషన్ నిర్వహణతో పాటు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వన్ టౌన్ అధికారులు, సిబ్బంది సేవలపై అభిప్రాయాన్ని కోరారు. ఫిర్యాదుదారులు వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పంటను పరిరక్షించుకుందాం

- మేలైన యాజమాన్య పద్ధతులు పాటిద్దాం
- నారుమడులు, లేత మొక్కలను కాపాడదాం
- సరైన విధానాలు పాటిస్తే సాగులో లాభాలు



వరి నారుమడులు

పెద్దాపురం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల సాధారణ జనజీవనానికే కాకుండా వ్యవసాయ రంగానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఇటీవల ఏకదాటిగా కురుస్తున్న వర్షాలు, వరదలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మరి వారి వేదన, నష్టం, కష్టం తీరాలంటే కొన్ని సూచనలు, సలహాలు తప్పనిసరి.

వరి పంటలో..

- జిల్లాలో ప్రధానంగా తొలకరి ఆరంభంలో అత్యధికంగా వరి సాగవుతుండగా కొన్ని ప్రాంతాల్లో కూరగాయాలు, ప్రత్తి, ఇతర ఆహార పంటలు వేశారు.
- వర్షాల నుంచి మొలకలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పిలక దశలో మొక్కలు, నారుమళ్లు కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు కచ్చితంగా పాటించాలి.
- వరి నారుమళ్లు ఇప్పటికీ వేయని వారు వానలు తగ్గుముఖం పట్టాక వేయాలి. వానలు కురిసేటప్పుడు వేస్తే విత్తనం కుళ్లిపోతోంది. మొలక శాతం తగ్గుతుంది.
- ఇప్పటికే వరి నారుమళ్లు వేసుకున్న రైతులు నారుమడిలో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉంటే త్వరగా బయటకు తరలించాలి.
- వెదజల్లు పద్ధతిలో విత్తితే పొలాల్లో గాని నారుమడుల్లో గాని నీటిని తొలగించాలి. చిన్న మొక్కలు నీటి నిల్వను తట్టుకోలేవు.
- ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కలుపు మందులు వాడకుండా ఉండడమే మంచిది. వానలు కురిసే సమయంలో కలుపు మందులు పిచికారీ చేస్తే అవి పనిచేసే సామర్థ్యం తగ్గుతుంది.

మొక్కజొన్న పంటలో..

మొక్కజొన్న పంటలో కూడా నిల్వ నీటిని కాలువలు, గండ్లు పెట్టి నీటిని తొలగించాలి. వర్షం తగ్గిన తరువాత బూస్టర్ మోతాదుగా ఎకరాలకు 35 కిలోల యూరియా, 15 కిలోల మూరోటైఫ్ పొటాష్ వేయాలి. జింక్ బోరాన్ లోపాలు కనిపిస్తే బోరాన్ రెండు గ్రాములు, చిలేటిడ్‌జింక్ గ్రాము చొప్పున పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కూరగాయాల పంటలు

కూరగాయల పంటలకు ఈ వర్షాలతో ఆకు మచ్చ కాండం, కుళ్లు తెగులు ఆశిస్తాయి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పోషక లోప నివారణకు 13–0–45 లీటర్ నీటికి పది గ్రాములు ఫార్ములా 42గా కలిపి పిచికారి చేయాలి.

జాగ్రత్తలు తప్పని సరి



వర్షాలు కురుస్తున్నందున రైతులు సాగు పద్ధతుల్లో జాగ్రత్తలు పాటించాలి. వరి నారు, మొక్కజొన్న, కూరగాయలు వేసిన రైతులు వ్యవసాయ శాఖాధికారులు సూచించే సూచనలు తప్పకుండా పాటించాలి. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు, రసాయనిక మందులు వేయాలి.

– సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖాధికారి, పెద్దాపురం

ఓటర్ల సర్వేకు సహకరించాలి

ఆర్డీవో రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల రీ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలపై ప్రజల్లో అపోహలు తొలగించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎన్నికల డీటీ కాంతారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, (వైఎస్సార్ సీపీ), నీలపాల సూరిబాబు (సీపీఎం), అడబాల కుమారస్వామి (టీడీపీ) లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

జాంధానీ చీరలను పరిశీలించిన విద్యార్థులు



చేనేత సొసైటీలో జాంధానీ చీరల డిజైన్లను పరిశీలిస్తున్న ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

కొత్తపల్లి: జాంధానీ చీరల తయారీలో పేటెంట్ హక్కు పొందిన ఉప్పాడ జాంధానీ చీరలను హైదరాబాదుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఉప్పాడలో చేనేత సొసైటీ, కొత్తపల్లిలోని శ్రీ దుర్గా చేనేత సొసైటీలో తయారు చేసిన చీరలను ప్రొఫెసర్ డాక్టర్ పృథ్వీ రాజ్ మాల్ ఆధ్వర్యంలో పరిశీలించారు. చీరలు తయారీ విధానాన్ని, డిజైన్ల వివరాలను సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చేనేత మగ్గాల వద్దకు వెళ్లి చీరల తయారీని పరిశీలించారు. పృథ్వీరాజ్ మాల్ మాట్లాడుతూ ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా చీరల తయారీ, డిజైన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళగిరి, వెంకటగిరి, పొందూరు, ఉప్పాడ తీసుకువెళ్లామన్నారు. ఒక్కో ఏరియాలో ఒక్కో విధంగా చీరల తయారీలో కళాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉప్పాడ జాంధానీ చీరల తయారీలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. చీర రెండు వైపులా ఒకే విధంగా ఉండడమే విద్యార్థులకు ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.

వాలంటీర్లకు వందనం – అన్నింటా అండగా ఉంటూ

మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్యరామపురంలోని సిరిగిడి రాజేశ్వరికి వలంటీరు మిరియాల ప్రతాప్ ప్రభుత్వ పథకాలు వివరించి కాపు నేస్తానికి దరఖాస్తు చేయించారు. గత మూడేళ్లుగా కాపు నేస్తం అందుకుంటున్నారు. వితంతు పింఛను వచ్చేలా చేశారు. అలాగే జగనన్న కాలనీలో ఇల్లు వచ్చేలా వలంటీర్ అర్హత గుర్తించి పట్టా వచ్చేలా చేశారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి ప్రోత్సహిస్తున్నారు.

– ఇంటింటా పర్యటించి సర్వే చేస్తున్న వలంటీర్ ప్రతాప్



సామర్లకోటలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వలంటీర్, సచివాలయ అడ్మిన్

తిరిగి తిరిగి అలసట వచ్చేది



గతంలో ప్రతి పనికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేది. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత వారు ప్రతి రోజు ఇంటికి వచ్చి అవసరాలు తెలుసుకుంటున్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం, పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చాలా ఇబ్బంది పడేవాళ్లం. అయినా ఫలితం కనిపించేది కాదు. నేడు మా కుటుంబంలో నాకు కాపు నేస్తం, వితంతు పింఛను, మా కుమార్తెలు ఇద్దరికీ జగనన్న కాలనీలో ఇళ్లు వచ్చేలా వలంటీర్ సహకరించారు.

– సిరిగిడి రాజేశ్వరి, పథకాల లబ్ధిదారు, సామర్లకోట

పేదల సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

- నియోజకవర్గంలో 22 వేలు ఇళ్ల పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే దొరబాబు
- నాగులాపల్లిలో జగనన్న సురక్ష



నాగులాపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: పేదవారి సొంతింటి కల సాకారం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని రాష్ట్రంలో 31 లక్షల పట్టాలు ఇస్తే అందులో ఈ నియోజకవర్గంలో 22 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. నాగులాపల్లిలోని సచివాలయం–2 వద్ద మంగళవారం సర్పంచి వడిశెట్టి గౌరీ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పత్రాలను ఎమ్మెల్యే అందించారు. తొలుత స్థానికంగా ఉన్న దివంగత నేత వైఎస్ . రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వంలో కూడా ఒక్క ఇళ్ల పట్టా కూడా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల పేరుతో ప్రజల గుండెల్లో నిలిచారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాను ఇచ్చి పేదల సొంతింటి కళను నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అనిశెట్టి వెంకట శుభాషిణీ, చింతపల్లి లక్ష్మి, ఉపసర్పంచి గుర్రాల చిరంజీవికుమార్, ఎంపీపీ కారే సుధ, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి బావనారాయణరెడ్డి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దారు జీవీఎస్ ప్రసాద్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వీకే రాయపురంలో..



వీకే రాయపురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: మండల పరిధి వీకే రాయపురంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పలువురికి వారికి అవసరమైన 578 సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ మోర్త పూర్ణిమ అధ్యక్షత వహించగా మండల ప్రత్యేకాధికారి జీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు వుటా వాసు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, ఎలిశెట్టి నరేష్, ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి గ్రామంలో..



తిరుపతిలో ధ్రువపత్రాన్ని, అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓ పీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి యు.భార్గవ్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, శృంగార వల్లభ స్వామి దేవస్థానం చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, డీటీ కాంతారావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం, కుంచే అమరావతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రమాదకరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌజన్య

కొత్తపల్లి: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. నాగులపల్లిలో మంగళవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటి కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ళ నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు.

విపత్తుల వేళ ఎన్‌సీసీ సేవలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విపత్తుల సమయంలో ఎన్‌సీసీ సేవలు అందిస్తున్నామని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ (ఏపీ,తెలంగాణా) ఎయిర్ కమాండర్ వి.మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఉన్న ఎన్‌సీసీ యూనిట్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. తెలంగాణ నాలుగు, ఏపీలో ఐదు ఎన్‌సీసీ గ్రూపులు ఉన్నాయని, కాకినాడ గ్రూపులో అత్యధికంగా 13 యూనిట్లు ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ సైబర్ సెక్యూరిటీ పాఠ్యాంశంగా చెబుతున్నామని, నిధుల సమస్య వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీసీ విస్తరణకు అవకాశం తక్కువ ఉందన్నారు. ఆయన వెంట కాకినాడ యూనిట్ గ్రూప్ కమాండర్ ఏకే రిషి పాల్గొన్నారు.

మేధాశక్తితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్‌పై మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేటి యువత, అధ్యాపకులు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్, ఆప్‌స్కిల్స్ సంస్థ సహకారంతో డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్–లెవరేజింగ్ పైథాన్ టెక్నాలజీస్ ప్రాక్టికల్ అప్రోచ్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజానికి అవసరాలే ముఖ్యంగా ఉండే సాఫ్ట్‌వేర్ రూపొందించాలని, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా మానవునికి భవిష్యత్‌లో సంభవించే ఆరోగ్యపరమైన సమస్యలను వైద్యులు గుర్తించనున్నట్టు తెలిపారు. ప్రస్తుత యువత సీఎస్‌ఈ వైపే మొగ్గు చూపుతున్నారని, వర్క్‌షాప్‌నకు అప్‌స్కిల్ సహకారం అందించడం సంతోషమన్నారు. ఐఐటీ భువనేశ్వరి అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ వారణాసి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ హెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఎస్.శాస్త్రి, సీఎస్‌ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సునీత, కె.ఝాన్సీ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసనలు



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల సభ్యులు



మున్సిపల్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పిఠాపురం: మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం గొల్లప్రోలులో ఆందోళన నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో నిరసన ప్రదర్శన చేసి, తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మణిపూర్‌లో మారణకాండ జరుగుతున్నా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం సరికాదన్నారు. తక్షణం మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దళాల పద్మ, కరణం విశ్వనాథం, విశ్వనాథం, సత్యవతి, తులసి, వెంకటలక్ష్మి, అమల, ఉమాదేవి, సత్యవతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం గొల్లప్రోలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్‌కే రహ్మాన్‌బీ, సీహెచ్ సూరిబాబు, డీవీపీఎస్ రాజేశ్వరి, మంగతాయారు, ఎంవీ సత్యనారాయణ, డి పద్మనాభం, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్ఘటనలు దేశానికే సిగ్గుచేటు

కొత్తపల్లి: మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశానికే అవమానకరమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మణిపూర్‌లో జరిగిన అమానుష మారణహోమాన్ని ఖండిస్తూ మంగళవారం కార్మిక, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలి చేశారు. అప్పారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో తెగల మధ్య సయోధ్యను కుదుర్చి శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల కార్యదర్శి సీహెచ్ సాంబశివకుమార్, సీఐటీయూ కార్యదర్శి సత్యన్నారాయణ, మండల సీఐటీయూ నాయకుడు కాళ్ళ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

పెద్దాపురం: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త పిలుపులో భాగంగా మంళవారం పెద్దాపురం మున్సిపల్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకులు ఆందోళన నిర్వహించారు. సిరిపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో 80 రోజులుగా జరుగుతున్న హింసకు కేంద్ర పాలకులు బాధ్యత వహించాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ, గూనూరి రమణ, సావిత్రి, సత్యవేణ తదితరులు పాల్గొన్నారు.

దొరస్వామి పరిశోధన పత్రానికి ఉత్తమ పురస్కారం



గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ దొరస్వామినాయక్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): థాయ్‌లాండ్ దేశం ఖోన్‌కేన్ యూనివర్సిటీలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన ఏడవ అంతర్జాతీయ లైబ్రేరీ ఇన్ఫర్మేషన్–2023 సదస్సులో బెస్ట్ పేపర్ అవార్డు జేఎన్‌టీయూకే గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి బి.దొరస్వామి నాయక్ సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాలు పాల్గొనగా ఆసియా ఖండంలో జేఎన్‌టీయూకే గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి దొరస్వామి నాయక్‌కు ఉత్తమ పురస్కారం దక్కింది. వర్సిటీ లైబ్రేరీలలో లైబ్రేరీ వనరులు, సేవలు, వినియోగదారుని సంతృప్తి అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. 2019 జనవరిలో కంబోడియా, 2021న శ్రీలంక రాజధాని కొలంబోలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొనగా ఇప్పుడు మూడోసారి పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా దొరస్వామి నాయక్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ సుమలత, రెక్టార్ రమణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ లైబ్రేరియన్ వేంకటేశ్వరరావు అభినందించారు.